క్లుప్తంగా

నేడు సీఎం జగన్ పుట్టినరోజు వేడుకలు

ఒంగోలు: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పుట్టినరోజు వేడుకలను గురువారం స్థానిక వైఎస్సార్ సీపీ జిల్లా కార్యాలయంలో ఘనంగా నిర్వహించనున్నట్లు వైఎస్సార్ సీపీ నగర కన్వీనర్ కటారి శంకర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి ఆదేశాల మేరకు ఉదయం 10.30 గంటలకు కేక్ కటింగ్ జరుగుతుందని, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జంకె వెంకటరెడ్డి, యువ నాయకుడు బాలినేని ప్రణీత్‌రెడ్డి, నగర మేయర్ గంగాడ సుజాత తదితరులు పాల్గొంటారని చెప్పారు. అనంతరం పలువురు పార్టీ నాయకులు సేవా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. పార్టీ శ్రేణులంతా పాల్గొనాలని కోరారు.

జగనన్న కాలనీ ముఖద్వారాలకు శంకుస్థాపన



శంకుస్థాపన చేస్తున్న దుంపా చెంచిరెడ్డి

చీమకుర్తి: సంతనూతలపాడులోని జగనన్న కాలనీలో లోపలకు, బయటకు రాకపోకలు సాగించేందుకు రెండు ముఖ ద్వారాలకు వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ దుంపా చెంచిరెడ్డి బుధవారం శంకుస్థాపన చేశారు. రూ.14 లక్షల వ్యయంతో ముఖద్వారాలు నిర్మిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ దుంపా రమణమ్మ, వైఎస్సార్ సీపీ స్థానిక నాయకులు పాల్గొన్నారు.

సంతనూతలపాడులో నేడు రక్తదాన శిబిరం

చీమకుర్తి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పుట్టినరోజు సందర్భంగా గురువారం సంతనూతలపాడు జెడ్పీ హైస్కూలు ఆవరణలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేస్తున్నట్లు వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ దుంపా చెంచిరెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. యువకులు, పార్టీ శ్రేణులు పాల్గొని రక్తదానం చేయాలని కోరారు.

బూచేపల్లి ట్రస్టు ద్వారా స్టడీ మెటీరియల్ పంపిణీ



స్టడీ మెటీరియల్ అందుకుంటున్న విద్యార్థులు

ఒంగోలు రూరల్: కరవది జెడ్పీ హైస్కూల్లో పదో తరగతి విద్యార్థులకు బూచేపల్లి ట్రస్టు ద్వారా స్టడీ మెటీరియల్, ఎగ్జామ్ మెటీరియల్‌ను బుధవారం అందజేశారు. హెచ్‌ఎం రవి కుమార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. అదేవిధంగా ప్రస్తుతం విదేశాల్లో ఉంటున్న కరవది జెడ్పీ హైస్కూల్ పూర్వ విద్యార్థి రఘునాథ్ సతీమణి కళ్యాణి లక్ష రూపాయలు విలువ చేసే కంప్యూటర్, ప్రింటర్, స్కానర్‌ను హైస్కూలుకు బహూకరించారు.

ఆరోగ్యశ్రీతో ఎన్నో ప్రయోజనాలు

- డీఎంహెచ్‌ఓ డాక్టర్ రాజ్యలక్ష్మి
- ఒంగోలు నగరంలోని గోపాల్‌నగర్–3 సచివాలయంలో కార్డులు పంపిణీ



6వ డివిజన్ కార్పొరేటర్ తిరుమలరావుకు కొత్త ఆరోగ్య శ్రీ కార్డు అందిస్తున్న డీఎంహెచ్‌ఓ రాజ్యలక్ష్మి

ఒంగోలు సబర్బన్: రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా అందిస్తున్న కొత్త ఆరోగ్య శ్రీ కార్డుల ద్వారా ఎన్నో ప్రయోజనాలు ఉన్నాయని డీఎంహెచ్‌ఓ డాక్టర్ రాజ్యలక్ష్మి తెలిపారు. ఒంగోలు నగరంలోని గోపాల్ నగర్–3వ వార్డు సచివాలయం పరిధిలో బుధవారం కొత్త ఆరోగ్య శ్రీ కార్డుల పంపిణీ కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. నూతన ఆరోగ్య శ్రీ కార్డులపై సచివాలయంలో అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. అనంతరం సచివాలయం పరిధిలో ఇంటింటికీ వెళ్లి ఆరోగ్య శ్రీ కార్డుల వలన కలిగే ప్రయోజనాల వీడియోను స్థానికులకు వినిపించారు. వారిచే ఈకేవైసీ వేయించి నూతన కార్డులు అందజేశారు. అదేవిధంగా దిశ యాప్ గురించి కూడా ప్రజలకు అవగాహన కల్పించారు. తొలుత ఒంగోలు నగరపాలక సంస్థకు చెందిన 6వ డివిజన్ కార్పొరేటర్ చల్లా తిరుమలరావుకు మొదటి కార్డు అందజేశారు. డీఎంహెచ్‌ఓ మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని ఆరోగ్య శ్రీ కార్డు ద్వారా వైద్యాన్ని రూ.25 లక్షల వరకు పెంచడంతో కోట్లాది మంది పేదలకు వైద్యం చేరువైందన్నారు. ఒంగోలు నగర కమిషనర్ ఎం.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ గోపాల్‌నగర్–3 సచివాలయం పరిధిలో మొత్తం 642 కొత్త ఆరోగ్య శ్రీ కార్డులు వచ్చాయన్నారు.

ఆడుదాం ఆంధ్రను విజయవంతం చేయాలి



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్, జేసీ, అధికారులు

ఒంగోలు సెంట్రల్: ఆడుదాం ఆంధ్ర కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కలెక్టర్ దినేష్‌కుమార్ అధికారులను ఆదేశించారు. ఈ నెల 26 నుంచి నిర్వహించనున్న ఆడుదాం ఆంధ్ర కార్యక్రమంపై సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, క్రీడా శాఖామంత్రి రోజా బుధవారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్‌తో పాటు జేసీ కె.శ్రీనివాసులు, మార్కాపురం సబ్ కలెక్టర్ రాహుల్ మీనా, ఇతర అధికారులు పాల్గొన్నారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ వాలీబాల్, కబడ్డీ, ఖోఖో, బ్యాడ్మింటన్, క్రికెట్ ఆటలు గ్రామ స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు నిర్వహించడం జరుగుతుందని చెప్పారు. ప్రతి సచివాలయం నుంచి ఆటలు నిర్వహించాలని తెలిపారు. ఈ నెల 21, 22, 23, 24 తేదీల వరకు వీడియో, టెలీ కాన్ఫరెన్స్‌లు నిర్వహించి ఎప్పటికప్పుడు జెడ్పీ సీఈఓ, ఎంపీడీఓ, ఎంఈఓ, పీఈటీ, పీడీలను అధికారులు అప్రమత్తం చేస్తారని చెప్పారు. ఎంఈఓ, వీఆర్‌ఓ, గ్రామ కార్యదర్శి ఆటల బృందాలను తయారు చేయాలని సూచించారు. ఎంపీడీఓ, మున్సిపల్ కమిషనర్లు సంబంధిత మైదానాలను పరిశీలించి సిద్ధం చేయాలని సూచించారు. ప్రతి సచివాలయం నుంచి ఐదు ఆటల నుంచి రెండు జట్లు ఎంపిక చేయాలని కలెక్టర్ ఆదేశించారు.

ఎంసీఏ నూతన కార్యవర్గం ఎంపిక



ఎంసీఏ అధ్యక్షుడు నాగేశ్వరరావుతో నూతన కార్యవర్గం

ఒంగోలు: మీడియా కెమేరామెన్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని నూతన అధ్యక్షుడు వి.నాగేశ్వరరావు బుధవారం ఎంపిక చేశారు. ప్రధాన కార్యదర్శిగా ఎస్.ప్రతాప్‌రెడ్డి, కోశాధికారిగా ఎ.రాజశేఖర్, గౌరవాధ్యక్షునిగా భాషాతో పాటు మరికొందరు ఉపాధ్యక్షులు, సహాయ కార్యదర్శులు, కార్యవర్గ సభ్యులను ఎంపిక చేశారు. నూతన కమిటీని ఎంసీఏ సభ్యులు సుబ్బారావు, అనిల్, ఇలియాజ్, కిషోర్ తదితరులు అభినందించారు.

వైభవంగా అయ్యప్పస్వామి నగరోత్సవం



పులి వాహనంపై ఊరేగుతున్న అయ్యప్పస్వామి

ఒంగోలు మెట్రో: స్థానిక మంగమూరు రోడ్డులోని హరిహరసుత అయ్యప్పస్వామి దేవస్థానంలో వార్షిక పవిత్రోత్సవాల చివరిరోజైన బుధవారం స్వామివారికి విశేష పూజలు నిర్వహించారు. ఆభరణ సేవలు, అన్నసంతర్పణ నిర్వహించినట్లు ఆలయ ప్రధాన అర్చకుడు పరాంకుశ కేశవాచార్యులు తెలిపారు. సాయంత్రం ఆరు గంటలకు మంగళ ధ్వని, కేరళ వారిచే చండపంచనాద స్వర వాయిద్యాలు, దేవిదేవతల విచిత్ర వేషధారణలతో స్వాముల శరణు ఘోషాలతో అయ్యప్పస్వామిని పులి వాహనంపై నగరంలోని పుర వీధుల్లో వైభవంగా ఊరేగించారు. చందు డ్యాన్స్ అకాడమీ విద్యార్థుల నృత్య ప్రదర్శన, రాత్రికి పడిపూజ, శయన హారతి, మాలధారులకు తీర్థప్రసాద వినియోగం, భిక్ష కార్యక్రమం నిర్వహించారు. అర్చకులు రంగాస్వామి, చక్రవర్తి, సమీర్‌కుమార్ పాల్గొన్నారు.

బాలల హక్కులకు ఆటంకం లేకుండా చూడాలి



భోజనం వడ్డిస్తున్న బత్తుల పద్మావతి

నాగులుప్పలపాడు: బాలల హక్కులు, వారి సంరక్షణకు ఎలాంటి ఆటంకం లేకుండా ప్రతిఒక్కరూ కృషి చేయాలని బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ రాష్ట్ర సభ్యురాలు బత్తుల పద్మావతి సూచించారు. ప్రకాశం జిల్లా బాలల సంరక్షణ కమిటీ సభ్యురాలు నీలిమాతో కలిసి బుధవారం మండలంలోని అమ్మనబ్రోలు జెడ్పీ హైస్కూల్, రెసిడెన్షియల్ పాఠశాలలను ఆకస్మికంగా తనిఖీ చేసి విద్యార్థినులతో మాట్లాడారు. పాఠశాలలో వసతి, ఆరోగ్యం గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం పాఠశాలలో విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. బాలుర ప్రభుత్వ వసతి గృహాన్ని పరిశీలించి విద్యార్థుల హాజరు, వసతిపై సంతృప్తి వ్యక్తం చేశారు. వార్డెన్ లింగయ్య, సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్ చంద్ర, సిబ్బంది పాల్గొన్నారు.

హాస్టల్‌కు ఫ్యాన్లు అందజేత



ఫ్యాన్లు అందిస్తున్న సంఘ ప్రతినిధులు, అధికారులు

ఒంగోలు సెంట్రల్: స్థానిక ప్రభుత్వ సాంఘిక సంక్షేమశాఖ వసతి గృహానికి విశ్వమానవ సంక్షేమ సంఘం బుధవారం టేబుల్, సీలింగ్ ఫ్యాన్లు అందించింది. ఏపీ స్టేట్ చైల్డ్ వెల్ఫేర్ కమిటీ సభ్యురాలు పద్మావతి, సంఘ వ్యవస్థాపకుడు పి.మస్తాన్‌రావు, జిల్లా విద్యుత్ శాఖ ఎస్‌ఈ సత్యనారాయణ, పంచాయతీరాజ్ ఎస్‌ఈ అప్పలరాజు, జిల్లా రచయితల సంఘ అధ్యక్షుడు పొన్నూరు వెంకట శ్రీనివాసులు, కొంగర నరసింహం, సీఏ రాంప్రసాద్, ఎస్‌ఆర్‌కేఎం ప్రొప్రయిటర్ రాధాకృష్ణమూర్తి, రిటైర్డ్ లైబ్రేరియన్ గురవారెడ్డి, హాస్టల్ వెల్ఫేర్ అధికారి శ్రీలత పాల్గొన్నారు.

హెచ్చరిక సంస్థలను మెరుగుపరచాలి : ఎంపీ

ఒంగోలు: తుఫాన్‌లు, వరదల నష్ట నివారణ చర్యలకు ముందస్తు హెచ్చరిక సంస్థలను మెరుగుపరచాల్సిన ఆవశ్యకతపై ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి బుధవారం పార్లమెంట్‌లో మాట్లాడారు. రూల్ నంబర్ 377 కింద మాట్లాడుతూ ప్రభుత్వ డేటా ప్రకారం ప్రపంచంలో హీన స్థితిలో వరద ప్రభావిత దేశంగా మన దేశం మిగిలిందన్నారు. ప్రపంచ మరణాల రేటులో 5వ వంతు మనదేశందే అన్నారు. ఏపీ వంటి సముద్రతీర రాష్ట్రాల్లో సంభవించే తుఫాన్‌లు, వాయుగుండాల వల్ల తరచూ వరదలు సంభవించి నష్టాలు జరుగుతున్నాయన్నారు. వాతావరణ మార్పులతోనే ఈ ప్రమాదాలు పెరుగుతున్నాయన్నారు. వీటి సమయాలు, తీవ్రతలను పర్యావరణ, అభివృద్ధి అంతర్జాతీయ సంస్థ అంచనా వేస్తోందన్నారు. ఇలాంటి దృష్టాంతాలలో ఆకస్మిక వరదల గురించి తగినంత ముందస్తు హెచ్చరికలు చేసేందుకు అవసరమైన శాస్త్రీయ పరిశోధనపై దృష్టి పెట్టడానికి సమర్థవంత హెచ్చరిక సంస్థ అవసరమన్నారు.

కొత్తపట్నంలో జాతీయ పెన్షనర్ల దినోత్సవం



మాట్లాడుతున్న ఎంపీడీవో సుజాత

కొత్తపట్నం: జాతీయ పెన్షనర్ల దినోత్సవాన్ని కొత్తపట్నంలోని పెన్షనర్ల భవనంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. ఎంపీడీవో డాక్టర్ పి.సుజాత పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగులు, ఉపాధ్యాయుల అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి ఉపాధ్యాయుల అసోసియేషన్ అధ్యక్షుడు ఉద్దగిరి జాలయ్య అధ్యక్షత వహించగా, పలువురు రిటైర్డ్ ఉద్యోగులు పాల్గొన్నారు. ఎంపీడీవో సుజాత మాట్లాడుతూ పెన్షనర్లు ఆనందంగా గడపాలని సూచించారు. రిటైర్డ్ డిప్యూటీ కలెక్టర్ పేరయ్య, ఈవోఆర్డీ ఏ బాలచెన్నయ్య, ఆదాము, వెంకటేశ్వర్లు, చాపల చిరంజీవి, కోటేశ్వరరావు, యేసుదాసు, భాస్కర్‌రావు, బలగాని యానాదిరావు, శర్మ, స్వామిరాజ్ పాల్గొన్నారు. పలువురు సీనియర్ సిటిజన్లను సన్మానించి భోజన వసతి కల్పించారు.

టేక్ హోం రేషన్ పంపిణీ

ఒంగోలు సబర్బన్: నగరంలోని గోపాల్‌నగర్ అంగన్‌వాడీ సెంటర్‌లో బాలింతలు, గర్భిణులు, చిన్నారులకు బుధవారం టేక్ హోం రేషన్ పంపిణీ చేశారు. ఒంగోలు నగర కమిషనర్ ఎం.వెంకటేశ్వరరావు చేతుల మీదుగా రేషన్ అందజేశారు. కమిషనర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతి ఒక్కరి విషయంలో ఎంతో శ్రద్ధ తీసుకుంటుందన్నారు. పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ చల్లా తిరుమలరావు, ఏఎస్‌ఎం, ఆశా వర్కర్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

వైజ్ఞానిక ప్రదర్శనను ప్రారంభించిన ఎంఈఓలు

మద్దిపాడు: మద్దిపాడులోని కడియాల యానాదయ్య ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మండల స్థాయి వైజ్ఞానిక ప్రదర్శనను ఎంఈఓలు ఎంవీఆర్ ఆంజనేయులు, ఎం.శ్రీనివాసరావు బుధవారం ప్రారంభించారు. మండలంలోని ఏడు ఉన్నత పాఠశాలల నుంచి విద్యార్థులు పాల్గొని ప్రదర్శించిన ప్రాజెక్టులు ఆకట్టుకున్నాయి. పాఠశాల ఇన్‌చార్జి హెచ్‌ఎం పెద్దిరెడ్డి కోటిరెడ్డి, వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

డ్రైనేజీ పనుల్లో నాణ్యత పాటించాలి

ఒంగోలు సబర్బన్: నగరంలో జరుగుతున్న ప్రధాన డ్రైనేజీ కాలువల నిర్మాణ పనుల్లో నాణ్యత పాటించాలని ఇంజినీరింగ్ అధికారులను ఒంగోలు నగర కమిషనర్ ఎం.వెంకటేశ్వరరావు ఆదేశించారు. బుధవారం ఇంజినీరింగ్ అధికారులతో కలిసి నగరంలో జరుగుతున్న డ్రైనేజీ కాలువల నిర్మాణ పనులను కమిషనర్ పరిశీలించారు. దక్షిణ బైపాస్‌లో జరుగుతున్న ప్రధాన డ్రైనేజీ కాలువ నిర్మాణ పనులను పరిశీలించి పలు సలహాలు, సూచనలు చేశారు. ఎంఈ జానీ, డీఈఈ పద్మజ, ఏఈఈలు, కాంట్రాక్టర్లు పాల్గొన్నారు.